Press Note of Sri Alleti Maheshwar Reddy,BJLP Floor Leader
25 Years of Modi Seva Abhiyan,Nirmal

Date: 07.10.2026

“25 ఏళ్ల సేవా ప్రస్థానం - దేశమే ధ్యాసగా , ప్రజాసేవే శ్వాసగా నరేంద్ర మోదీగారి ప్రయాణం..” - ఏలేటి మహేశ్వర్ రెడ్డి

“ఎన్ని కష్టాలు వచ్చినా.. సవాళ్లు ఎదురైనా.. మోదీ గారి ఆశీర్వాదంతో తెలంగాణలో కాషాయ జెండా ఎగరేస్తాం” - ఏలేటి మహేశ్వర్ రెడ్డి

సెప్టెంబర్ 17న నరేంద్ర మోదీ గారి జన్మదినం సందర్భంగా ప్రారంభమైన సేవా సంకల్ప్ అభియాన్ దేశవ్యాప్తంగా కోట్లాది మంది ప్రజలకు సేవ చేయడం, వారికి స్ఫూర్తినివ్వడం మరియు భవిష్యత్తు తరాలకు ఆదర్శంగా నిలవడానికి వారికి ఒక దశ, దిశ చూపడం కోసం కొనసాగుతోంది. అందులో భాగంగానే ఈరోజు సేవా జ్యోతి కలశ యాత్రలో పాల్గొన్నామని ఏలేటి మహేశ్వర్ రెడ్డి గారు తెలిపారు.

2001 అక్టోబర్ 7న గుజరాత్ ముఖ్యమంత్రిగా ప్రారంభమైన ఈ ప్రయాణం, భారత ప్రధానమంత్రిగా దేశానికి నాయకత్వం వహించే స్థాయికి చేరిందని ఆయన అన్నారు. అందుకు కారణం దేశం పట్ల నిబద్ధత, ప్రజల పట్ల బాధ్యత, అభివృద్ధి పట్ల దృఢ సంకల్పమని పేర్కొన్నారు.

ప్రపంచ పటంలో భారతదేశ ఖ్యాతిని పెంచిన నాయకుడు నరేంద్ర మోదీ గారని ఏలేటి మహేశ్వర్ రెడ్డి గారు అన్నారు. మొఘలుల పాలన నుంచి బ్రిటిష్ పాలన వరకు.. ఆ తర్వాత దశాబ్దాల కాంగ్రెస్ పాలనలో వెనుకబడిన భారత్‌ను.. నేడు ప్రపంచ వేదికపై తనదైన స్థానం సాధించే దిశగా పునర్నిర్మాణం చేస్తున్న నాయకత్వం శ్రీ నరేంద్ర మోదీ గారిదని పేర్కొన్నారు.

‘అబ్ కీ బార్ మోదీ సర్కార్’, ‘సబ్ కా సాథ్, సబ్ కా వికాస్’ అనే నినాదాలు కోట్లాది మంది హృదయాలను తాకాయని ఆయన అన్నారు. దాదాపు మూడు దశాబ్దాలు ఒకే పార్టీకి ప్రజలు ఒక విప్లవాత్మకమైన తీర్పు ఇచ్చారని పేర్కొన్నారు. భారతదేశ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా వరుసగా మూడోసారి నరేంద్ర మోదీ గారిపై ప్రజలు విశ్వాసం ఉంచారని, ఆయన అందిస్తున్న పటిష్ఠమైన నాయకత్వమే అందుకు కారణమని అన్నారు.

అయితే, నరేంద్ర మోదీ గారి ప్రతిష్ఠను దెబ్బతీసేందుకు కాంగ్రెస్ పార్టీ కుటిల రాజకీయాలు చేస్తోందని ఏలేటి మహేశ్వర్ రెడ్డి గారు విమర్శించారు. గతంలో ఎన్నికల్లో గెలిచినప్పుడు దేశంలో చాలా దొంగ ఓట్లు ఉన్నాయని కాంగ్రెస్ నేతలే చెప్పారని గుర్తుచేశారు. ఇప్పుడు SIR వచ్చిన తర్వాత కాంగ్రెస్ ఓడిపోతున్నందుకే ‘ఓటు చోరీ’ అంటూ రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు.

కర్ణాటకలో, తెలంగాణలో, కేరళలో కాంగ్రెస్ ప్రభుత్వాలు ఎలా ఏర్పడ్డాయని ఆయన ప్రశ్నించారు. గతంలో 7–8 సార్లు SIR వంటి ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలు జరిగినప్పుడు కాంగ్రెస్ పార్టీ ఎందుకు మాట్లాడలేదని నిలదీశారు.

దేశంలో కోట్లాది మంది అక్రమంగా చొరబడిన వారి ఓట్లు, డూప్లికేట్ ఓట్లు, మరణించిన వారి ఓట్లు తొలగిస్తే కాంగ్రెస్ పార్టీకి ఎందుకు బాధ కలుగుతోందని ప్రశ్నించారు. ఒకే వ్యక్తి రెండు, మూడు చోట్ల ఓట్లు నమోదు చేసుకుని ఉంటే వాటిని తొలగించడం కూడా ఎందుకు కాంగ్రెస్ పార్టీకి ఇబ్బందిగా మారిందని అన్నారు. ఈ దేశానికి సంబంధం లేని వ్యక్తుల పేర్లు కూడా ఓటర్ల జాబితాల్లో ఉంటే, వాటిని సరిచేసే ప్రక్రియను కాంగ్రెస్ పార్టీ ఎందుకు వ్యతిరేకిస్తోందని ఏలేటి మహేశ్వర్ రెడ్డి గారు ప్రశ్నించారు.

‘నేషన్ ఫస్ట్, పార్టీ నెక్స్ట్, సెల్ఫ్ లాస్ట్’ అనే సిద్ధాంతాన్ని పాటిస్తున్నందుకే నరేంద్ర మోదీ గారి నాయకత్వం ప్రత్యేకమని ఆయన అన్నారు. కాంగ్రెస్ పార్టీ మాత్రం ఎప్పుడూ ఒక ఖాందాన్ నుంచి ఒకరి తర్వాత మరొకరు ప్రధానమంత్రి కావాలనే ఆలోచనతోనే పనిచేస్తోందని విమర్శించారు.

అలాంటి పరిస్థితులకు భిన్నంగా నరేంద్ర మోదీ గారు జన్ ధన్ యోజన పేరుతో ఒక గొప్ప డిజిటల్ విప్లవాన్ని తీసుకొచ్చారని ఏలేటి మహేశ్వర్ రెడ్డి గారు అన్నారు.

2014లో ఎర్రకోటపై నుంచి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గారు మరుగుదొడ్ల గురించి మాట్లాడినప్పుడు దేశం ఆశ్చర్యపోయిందని ఆయన అన్నారు. అయితే, 2014కు ముందు దేశం ఎంత దయనీయమైన స్థితిలో ఉందో నరేంద్ర మోదీ గారు దేశ ప్రజలకు వివరించారని పేర్కొన్నారు. స్వచ్ఛ భారత్ ద్వారా ఆడబిడ్డల ఆత్మగౌరవాన్ని కాపాడారని అన్నారు.

స్వచ్ఛ భారత్ మిషన్ కింద 12.11 కోట్ల మరుగుదొడ్లు నిర్మించారని, దీన్ని బట్టి 2014కు ముందు భారతదేశం ఎంత దయనీయమైన పరిస్థితుల్లో ఉందో అర్థం చేసుకోవచ్చని ఏలేటి మహేశ్వర్ రెడ్డి గారు అన్నారు.

‘మేక్ ఇన్ ఇండియా’ అనే నినాదంతో తయారీ రంగంతో పాటు రక్షణ రంగంలోనూ భారత్‌ను ముందుకు తీసుకెళ్లారని ఆయన అన్నారు. 2014కు ముందు ఒక బుల్లెట్ కొనాలన్నా ఇతర దేశాలపై ఆధారపడాల్సిన పరిస్థితి ఉండేదని పేర్కొన్నారు. నేడు ఫైటర్ జెట్ ఇంజిన్ తయారు చేసే స్థాయికి భారత్ చేరిందంటే అది నరేంద్ర మోదీ గారి నాయకత్వం వల్లేనని అన్నారు. రక్షణ పరికరాలు, ఆయుధాలు, క్షిపణులను భారత్ స్వయంగా తయారు చేయడమే కాకుండా ఇతర దేశాలకు ఎగుమతి చేసే స్థాయికి చేరిందని పేర్కొన్నారు.

సర్జికల్ స్ట్రైక్ గురించి ప్రస్తావిస్తూ, హైదరాబాద్‌లోని గోకుల్ చాట్, లుంబినీ పార్క్, ముంబై వంటి ప్రాంతాల్లో ఉగ్రవాద దాడులు జరిగినప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం చేతులు ముడుచుకుని కూర్చుందని ఏలేటి మహేశ్వర్ రెడ్డి గారు విమర్శించారు. ‘ఘర్ మే ఘుస్ కే మారేంగే’ అనే దృఢమైన వైఖరితో నరేంద్ర మోదీ గారి ప్రభుత్వం పాకిస్థాన్‌లోని ఉగ్రవాద స్థావరాలను నేలమట్టం చేసిందని అన్నారు.

ఆయుష్మాన్ భారత్ పథకం ద్వారా ఇప్పటివరకు 43.52 కోట్ల కార్డులు జారీ చేశామని, PM-KISAN పథకం ద్వారా 9.32 కోట్ల మంది రైతులకు ఇప్పటివరకు ₹4.27 లక్షల కోట్లను బదిలీ చేయగలిగామని ఏలేటి మహేశ్వర్ రెడ్డి గారు తెలిపారు.

తెలంగాణలో ప్రజల ఇళ్లను, భూములను లాక్కుంటున్న పరిస్థితి మీ అందరికీ తెలుసని ఆయన అన్నారు. 22-A Prohibited List పేరుతో లక్షలాది మంది ప్రజలు భూ సమస్యలను ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఈ అంశంపై అసెంబ్లీలో బీజేపీ గట్టిగా గళమెత్తిందని తెలిపారు. అవినీతికి పాల్పడిన వారెవరినీ బీజేపీ వదిలిపెట్టదని స్పష్టం చేశారు.

చివరిగా, తనను గెలిపించి ఆశీర్వదించిన నిర్మల్ ప్రజలకు ‘మీ మహేశన్నగా’ ఒక మాట చెబుతున్నానని ,మోదీ గారి ఆశీర్వాదంతో ఎన్ని కష్టాలు వచ్చినా, ఎన్ని సవాళ్లు ఎదురైనా తెలంగాణలో కాషాయ జెండా ఎగరేసే వరకు వెనక్కి తగ్గేది లేదని స్పష్టం చేశారు. బీజేపీ నాయకులు, కార్యకర్తలందరం కలిసికట్టుగా పనిచేసి తెలంగాణలో బీజేపీని బలోపేతం చేసి, కాషాయ జెండాను ఎగరేస్తామని ఏలేటి మహేశ్వర్ రెడ్డి గారు అన్నారు.